ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 23 డిసెంబరు 2024



## 'సిరుల తల్లి' ఒడిలో.. మరో వసంతం

- నేడు సింగరేణి 136వ ఆవిర్భావ దినోత్సవం 7



సింగరేణి ఓపెన్‌కాస్టు గని

## సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

- తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు 8



సర్వ శిక్ష ఉద్యోగుల దీక్షకు మద్దతు తెలుపుతున్న తపస్ నాయకులు

### న్యూస్ బాక్స్

### నేడు సీఎం కప్ జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు గోదావరిఖని జేఎన్ఎస్ స్టేడియంలో సోమవారం ఉదయం10గంటలకు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో 10-17ఏళ్లలోపు బాలబాలికలు పాల్గొనాలని, 50,100 మీటర్ల ఫ్రీస్టైల్, బ్యాక్‌స్ట్రోక్, బట్టర్‌ఫ్లై, 200 మీటర్లలో ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బటర్‌ఫ్లై, ఇండివిజ్యువల్ మిడిల్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని, ఆసక్తిగల క్రీడాకారులు ఇన్‌చార్జి పీడీ సోమశేఖర్ 8309978003, జడ్పీహెచ్ఎస్ శోభారాణి, అంతర్గాం జడ్పీహెచ్ఎస్ ఎండి జావెద్ 6304689959, స్విమ్మింగ్ కోచ్ కృష్ణమూర్తి, సారంగపాణిలను సంప్రదించాలని కోరారు.

### నేడు అయ్యప్పస్వామి శోభాయాత్ర

సుల్తానాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ పట్టణంలోని నీరుకుళ్ల రోడ్డులోని అయ్యప్ప దేవాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్వామి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ బుచ్చిరెడ్డి తెలిపారు. రథోత్సవం సోమవారం ఉదయం 9గంటలకు ఆలయం నుంచి కొనసాగుతుందన్నారు. మంగళవారం అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమం సాయంత్రం జరుగుతుందని, ఈ రెండు రోజుల కార్యక్రమాల్లో భక్తులు, స్వాములకు అన్నదానం ఉంటుందన్నారు.

● మంథని (ఆంధ్రజ్యోతి) : మంథని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో పదునెట్టాంబడి మహా పడిపూజ, దీక్షాపరులకు అగ్నిగుండాల కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో రాత్రి గంటలకు సంజీవ్ నంబూద్రి స్వామి ఆధ్వర్యంలో మహాపడి పూజ నిర్వహించన్నట్లు తెలిపారు. అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

### అదనపు జీపీగా శంతన్ కుమార్ నియామకం



శంతన్ కుమార్

కోల్‌సిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఇండస్ట్రియల్ ట్రిబునల్ కం లేబర్ కోర్టు, అదనపు జిల్లా న్యాయ స్థానంలో ఏజీపీగా గోదావరిఖనికి చెందిన సీనియర్ న్యాయవాది శంతన్ కుమార్‌ను నియమించారు. ఈ మేరకు న్యాయశాఖ జీఓ ఆర్‌టీ నెం.870జారీ చేసింది. మూడేళ్ల పాటు ఆయన కొనసాగనున్నారు. సివిల్ కేసుల్లో ఆయన సేవలను వినియోగించుకోనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న జాగిరి రాజయ్య స్థానంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు.

# మారనున్న స్థానిక ముఖచిత్రం

- ఎన్నికల్లో పదేళ్ల రిజర్వేషన్లకు చెల్లు
- ఐదేళ్లకోసారి రొటేషన్ ప్రాతిపదికన రిజర్వేషన్లు
- జిల్లాలో పెరగనున్న ఎంపీటీసీ స్థానాలు
- పంచాయతీరాజ్ చట్టానికి ప్రభుత్వం సవరణలు




(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ముఖచిత్రం మారనున్నది. గత ప్రభుత్వ హయాంలో తీసుకవచ్చిన నూతన పంచాయతీరాజ్ చట్టం-2018కి ప్రభుత్వం పలు సవరణలు చేసింది. దీంతో ఎన్నికల్లో రిజర్వేషన్లు మారనున్నాయి. పదేళ్లకోసారి ఒకే రిజర్వేషన్ విధానాన్ని ఐదేళ్లకు మారుస్తూ చట్ట సవరణ చేసింది. ప్రతి మండలంలో కనీసం ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొనడంతో కొన్ని ఎంపీటీసీ స్థానాలు పెరగనున్నాయి.

జిల్లాలో 267 గ్రామ పంచాయతీలు, 2,484 వార్డులు ఉన్నాయి. పంచాయతీల పాలక వర్గాల పదవీ కాలం ఫిబ్రవరి 2వ తేదీతో ముగిసింది. అప్పటినుంచి పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. అలాగే జిల్లాలో 13 రూరల్ మండలాలు, ఒక అర్బన్ మండలం ఉంది. 13 మండలాలకు జిల్లా ప్రజా పరిషత్ సభ్యులు, 13 మండల పరిషత్‌లు ఉన్నాయి. మండల పరిషత్‌ల్లో మొత్తం 137 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని స్థానిక సంస్థల ముఖచిత్రాన్ని మార్చివేసింది. 10 జిల్లాలను పునర్విభజించి 33 జిల్లాలుగా చేసింది. దీంతో రెవెన్యూ డివిజన్లతో పాటు, కొత్త మండలాలు కూడా ఏర్పడ్డాయి.

2019లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వం పాత పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి నూతన చట్టం-2018ని తీసుకవచ్చింది. అంతకుముందు ప్రతి ఐదేళ్లకోసారి ఉన్న రిజర్వేషన్ విధానాన్ని పదేళ్లకు పెంచింది. పదేళ్ల తర్వాత రొటేషన్ పద్ధతిన కొనసాగనున్నదని పేర్కొంది. అలాగే కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను పెంచి వాటిలో కొన్ని గ్రామాలను విలీనం చేసింది. అంతేగాకుండా 500 జనాభా కలిగిన గ్రామాలన్నింటినీ, గిరిజన తండాలు, గూడెంలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అందులో భాగంగా జిల్లాలో 58 కొత్త పంచాయతీలు ఏర్పాటయ్యాయి. 2019లో స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా రాష్ట్రంలో మరికొన్ని మండలాలతో పాటు పంచాయతీలు కూడా ఏర్పడ్డాయి. దీంతో పదేళ్ల రిజర్వేషన్ విధానం ప్రకారం ఎన్నికలు నిర్వహించడం కుదరదని భావించిన ప్రభుత్వం చట్ట సవరణ చేసి ఐదేళ్లకోసారి రిజర్వేషన్ మారే విధానాన్ని తీసుకవచ్చింది. దీంతో జిల్లాలోగల గ్రామపంచాయతీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, మేయర్, కార్పొరేటర్ల రిజర్వేషన్లన్నీ మారనున్నాయి. జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీల వారీగా నిర్ధేశించే రిజర్వేషన్ల శాతం ప్రకారం కేటాయించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించనున్నారు.

### ఆ పంచాయతీలకు జరగనున్న ఎన్నికలు..

గత ఐదేళ్లుగా ఎన్నికలకు నోచుకోని నాలుగు గ్రామపంచాయతీలు ఈసారి ఎన్నికలకు నోచుకోనున్నాయి. 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికలకు ముందు అంతర్గాం మండలం కుందనపల్లి, లింగాపూర్, రామగిరి మండలం వెంకట్రావుపల్లి పంచాయతీలతో పాటు పాలకుర్తి మండలం ఎల్కలపల్లి పరిధిలోగల రెండు వార్డులను రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు.

మిగతా 8వ పేజీలో..

# గాడిన పడుతున్న రామగుండం నగర పాలన

- పట్టు బిగిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష
- రూ.13కోట్ల అభివృద్ధి పనులకు పాలనా పరమైన అనుమతులు
- అభివృద్ధి పనులపై ప్రతివారం సమీక్ష



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, ఇన్‌సెట్‌లో కలెక్టర్ శ్రీహర్ష

కోల్‌సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రామగుండం నగరపాలన గాడిన పడుతోంది. కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న కోయ శ్రీహర్ష రామగుండం నగరపాలన పరిస్థితిని సమీక్షించి పాలనపై దృష్టి పెట్టారు. కమిషనర్ శ్రీకాంత్ సెలవులో వెళ్లడంతో ఆయన స్థానంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీని పూర్తిస్థాయి బాధ్యతలతో కమిషనర్‌గా నియమించారు. నూతన మున్సిపల్ చట్ట ప్రకారం నగరపాలనపై కలెక్టర్‌కు విశేష అధికారాలున్నాయి. పరిపాలనాపరమైన మంజూరులు, కౌన్సిల్ తీర్మానాలను ఆమోదించడం, రద్దు చేయడం వంటివి అధికారాలు ఉంటాయి. ఉద్యోగులు, అధికారులను విధుల్లో నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా తొలగించవచ్చు. ఈ పరిస్థితుల్లో రామగుండం పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతివారం సమీక్ష జరుపుతున్నారు. కౌన్సిల్ సమావేశాలు జరుగకపోవడం, తీర్మాణాలు, ఇతర ప్రక్రియల్లో జాప్యం ఉండే అవకాశం ఉండడంతో కలెక్టరే నిధులు, పనులకు సంబంధించి పాలనా పరమైన మంజూరు ఇస్తున్నారు. టీయూఎఫ్ఐడీసీ, ఫ్లడ్ రిలీఫ్ ఫండ్స్ 14,15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేయిస్తున్నారు. ఎల్ఆర్ఎస్ నిధులకు సంబంధించి వడ్డీ సొమ్ము రూ.50లక్షలను వీధి దీపాల స్పేర్ పార్ట్స్ కొనేందుకు వెచ్చించారు. 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి రూ.49.85లక్షలతో 8 ఆటో ట్రాలీలు, రూ.40లక్షలతో 5 ట్రాక్టర్లు, మరో రూ.14లక్షలతో శానిటేషన్ మెటీరియల్ కొనుగోలు చేయించారు. రూ.50లక్షల 14వ ఆర్థిక సంఘం నిధులను కొత్తగా వీధి దీపాలకు పోల్స్ వేసేందుకు వెచ్చించనున్నారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రతి వారం అధికారులతో సమీక్షించి టార్గెట్లు పెడుతున్నారు. ఆస్తిపన్ను బకాయిదారులపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించారు. ఎన్‌టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యాలతో కార్పొరేషన్‌కు సంబంధించి పన్నుల చెల్లింపులు, అనుమతులపై సమన్వయం చేస్తున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఉద్యోగులపై కూడా వేటు వేశారు. దీంతో పాలన పరమైన వ్యవహారాలు గాడిలో పడుతున్నాయి.

## చదరంగం ఆటతో చురుకుదనం..

- జిల్లా యుజన క్రీడల అభివృద్ధి అధికారి సురేష్



జిల్లా స్థాయి చదరంగ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సుల్తానాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చదరంగం ఆడడం ద్వారా చురుకుదనం పెరిగి అన్ని రంగాల్లో రాణించవచ్చని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి వై సురేష్ అన్నారు. సుల్తానాబాద్‌లోని శ్రీవాణి జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి సీఎం కప్ చదరంగ పోటీలను డీవైఎస్‌వో సురేష్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డాల శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో సురేష్ మాట్లాడుతూ ఎదుగుదలకు తోడ్పాటునందించే చెస్‌ను కేరీర్‌గా ఎంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్బిట్ రామయ్య, శ్రీవాణి కళాశాల ప్రిన్సిపాల్ మండారి కమలాకర్, పురెళ్ల సదానందం, పెటా జిల్లా కార్యదర్శి దాసరి రమేష్, పల్లా అనిల్ ప్రణయ్, జావిద్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఖని ఆర్టీసీ డిపోలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు




క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్‌టీసీ డిపోలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎఫ్ సంధ్యారాణి, ట్రాఫిక్ ఎస్ఐ హరిశంకర్ హాజరై కేక్ కట్ చేశారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ లక్ష్మణ్ జాకబ్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వలీ మహ్మద్, అంజయ్య, ఆకాష్, డేవిడ్, చిట్టి బాబు, తిరుమల, యెహోన, స్వామి, స్టీఫెన్ పాల్గొన్నారు.

### పేద క్రైస్తవులకు దుస్తులు పంపిణీ

మంథని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పండగను పురస్కరించుకొని మండలంలోని పేద క్రైస్తవులకు స్థానిక సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో దుస్తులు ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాస్టర్ వల్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు ప్రేమను చూపుతూ ఇతరులకు సహాయం చేసేవారిగా ఉండాలన్నారు. చర్చిలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్, పాస్టర్ దూడ మహేష్, సంఘ పెద్దలు జోసెఫ్, మంథని ప్రసాద్, చింతకుంట్ల ప్రేమ్‌కుమార్, రమేష్, సందానందం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి

సుల్తానాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమ జిల్లా ప్రభారీ అరుముళ్ల పోచం అన్నారు. మండలంలోని గర్రెపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గర్రెపల్లిలో పలు బూత్ కమిటీలకు అధ్యక్ష కార్యదర్శులుగా మాదాసు సతీష్‌పసెడ్ల మురళి, గున్నల ప్రవీణ్, పప్పు సంపత్, గోసిగొండ రాజు, జెట్టి శ్రీనివాస్, వడ్లకొండ విజయ, కుందేళ్ళ సతీష్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కందుల శ్రీనివాస్, నల్లవెల్లి శంకర్, పసెడ్ల రాజు, వడ్లకొండ మహేష్, కల్లెపల్లి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం : డీపీవో

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని రాఘవపూర్ గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వే చివరి దశకు వచ్చిందని సర్వేలను పూర్తి చేసి, నివేదికలను సమర్పించాలని కోరారు. అలాగే గ్రామపంచాయతీల్లో నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పీవో వేణుగోపాల్, పంచాయతి కార్యదర్శి రవిందర్, సిబ్బంది గుండేటి క్రాంతి, శ్వేత, స్వప్నలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుండా పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక ఎంపీడీవో అల్లం పూర్ణచందర్‌రావు అన్నారు. ఆదివారం పాలకుర్తి మండల కేంద్రంలో ఇళ్లు లేని నిరుపేదలు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా సిబ్బంది చేస్తున్న సర్వేను ఎంపీడీవో పరిశీలించారు.

### రామగుండం ట్రాఫిక్ సీఐగా రాజేశ్వర్‌రావు

కోల్‌సిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బీ రాజేశ్వర్‌రావుకు పోస్టింగ్ ఇచ్చారు. రామగుండం కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఆయనకు ట్రాఫిక్ పోస్టింగ్ ఇచ్చారు. గతంలో మహదేవాపూర్ ఠాణాలో పని చేశారు.

## 'కాకా' సేవలు మరువలేనివి..

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



సుల్తానాబాద్‌లో కాకా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు



గోదావరిఖనిలో కాకా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ అనీల్ కుమార్

సుల్తానాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మాజీ మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి సేవలు మరువలేనివని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. వెంకటస్వామి వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. సుల్తానాబాద్ పట్టణంలోని కాకా విగ్రహానికి ఎమ్మెల్యే విజయరమణారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయిరి మహేందర్, వేగోళం అబ్బయ్య గౌడ్, రవి, సజ్జత్, గంగుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

● కళ్యాణ్‌నగర్ (ఆంధ్రజ్యోతి): కాకా వెంకటస్వామి వర్థంతి సందర్భంగా గోదావరిఖని జీఎం కార్యాలయం వద్ద ఉన్న వెంకటస్వామి విగ్రహానికి నగర మేయర్ బంగి అనీల్ కుమార్, కార్పొరేటర్ మహంకాళి స్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, పీ మల్లికార్జున్, దీటి బాలరాజు, ఎండీ ముస్తాఫా, అడ్డాల రామస్వామి, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, దుబాసి మల్లేష్, వెంకటస్వామి, యాకూబ్, అనుమ సత్యనారాయణ, అల్లి శంకర్, కామ విజయ్, రాచకొండ కోటేశ్వర్లు, నర్సింగ్ పాల్గొన్నారు. మాల మహానాడు ఆధ్వర్యంలో వెంకటస్వామి వర్ధంతి నిర్వహించారు. చౌరస్తాలో మాల మహానాడు కార్యాలయంలో వెంకటస్వామి చిత్రపటానికి మాలెం మధు, మొక్క సుదర్శన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిట్టల వెంకటి, నంది నగేష్, రాజేష్, లక్ష్మణ్, సంజీవరావు, లింగయ్య, కుమార్, నరేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## గోదాం నిర్మాణంతో రైతులకు తగ్గిన దూరభారం



కనగర్తి గ్రామంలోని గోదాం

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లగా దూరభారంతో ఇబ్బందులకు గురైన రైతులకు ఊరట లభించింది. మండలంలోని అప్పన్నపేట వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కనగర్తిలో నిర్మించిన ఎరువుల గోదాం అందుబాటులోకి వచ్చింది. ఎరువు బస్తాల కోసం రైతులు అప్పన్నపేటలోని సొసైటీకి వెళ్లి తీసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు కనగర్తిలో గోదాం నిర్మాణంతో ఆర్థికభారం తగ్గడమే కాకుండా సమయం ఆదా అవుతోంది. కనగర్తి, కాపులపల్లి, కాసులపల్లి, గోపయ్యపల్లి, బొంపల్లి, పాలితం, పుట్టపల్లి గ్రామాల గోదాం నిర్మాణం రైతులకు ఉపయోగకరంగా ఉంది. దీంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● **ఎరువులు అందుబాటులో..**

కనగర్తి గోదాం నిర్మాణం అయ్యాక యాసంగి సాగుకు అప్పన్నపేట వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 15 రోజుల క్రితం ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచారు. 20.20 రకం 400 బస్తాలు, 28.28 రకం 400 బస్తాలు అందుబాటులో ఉంచగా ఇప్పటి వరకు 20.20 185 బస్తాలు, 28.28 309 బస్తాలు విక్రయించినట్లు సింగిల్ విండో సీఈవో తిరుపతి తెలిపారు.

● **ఆర్థికభారం తగ్గింది**

- కట్టెకోల మధు, కనగర్తి



కనగర్తి గ్రామంలో గోదాం నిర్మాణం చేపట్టి ఎరువులు అందుబాటులో ఉంచడంతో రవాణ ఖర్చు లేకుండా ఆర్థికభారం తగ్గింది. పంటల సాగు సమయంలో పంటకు అవసరమున్న ఎరువుల కోసం వెళ్లే ఆటో రవాణా ఖర్చులతో పాటు సమయం వృథా అయ్యేది. అందుబాటులోకి గోదాం రావడం చాలా ఆనందంగా ఉంది.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామ శివారులో విద్యుదాఘాతంతో అదే గ్రామానికి చెందిన జంగిటి నవీన్(32) మృతి చెందినట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన జంగిటి చిన్న నర్సయ్య అలియాస్ ఇచ్చన్న శనివారం జంతువుల వేట కోసమని గ్రామ శివారులోని మామిడి తోటకు నవీన్‌ను వెంట తీసుకెళ్లాడు. అంతకుముందే చిన్న నర్సయ్య ఎలక్ట్రిక్ తీగకు కరెంట్ షాక్ పెట్టి అక్కడ ఉంచాడు. ఆ విషయం తెలియక నవీన్ అటు వైపు వెళ్లడంతో తీగకు కాలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. తన భర్త చావుకు చిన్న నర్సయ్యనే కారణమంటూ నవీన్ భార్య రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ పరిశీలించారు.

## వ్యాన్ ఢీకొని ద్విచక్రవాహనదారుడి మృతి

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన గాజుల సత్యనారాయణ(50) అనే వ్యక్తి శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై వెంకట్రావునగర్ నుంచి కొత్త బస్టాండ్ వద్ద యూటర్న్ చేస్తుండగా ట్రావెలర్ వ్యాన్ ఢీకొని తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తున్న సత్యనారాయణ కూతురు వివాహం ఇటీవల జరిగింది. ఆదివారం వధూవరులకు ఓడిబియ్యం కార్యక్రమం నిర్వహించాల్సి ఉండడంతో ద్విచక్రవాహనంపై సెలూన్‌కు వెళ్లి కటింగ్ చేసుకొని తిరిగి ఇంటికి వచ్చాడు. అయితే సెలూన్ వద్ద సెల్‌ఫోన్ మరిచిపోవడంతో తీసుకొని అదేమార్గంలో ఉన్న బంధువులను పిలిచి వస్తానని చెప్పి ఇంట్లోనుంచి ద్విచక్రవాహనంపై సత్యనారాయణ వెళ్లాడు. సిరిసిల్ల కొత్తబస్టాండ్ వద్ద యూటర్న్ చేస్తుండగా కామారెడ్డి వైపు వెలుతున్న టీఎస్ 23, 1126 నంబర్ గల వ్యాన్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఓడిబియ్యం కార్యక్రమం జరగాల్సిన ఇంట్లో యజమాని రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో విషాదం అలుముకుంది. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేట్లు చూస్తామని పోలీసులు హామి ఇవ్వడంతో ఆందోళన సద్దుమనిగింది. మృతుడు సత్యనారాయణకు భార్య అరుణ, కూతురు, కుమారుడు ఉన్నారు. సంఘటనపై ఇల్లంతకుంట మండలంలోని జగ్గారెడ్డిపల్లికి చెందిన విలాసాగరం వేణు అనే వ్యాన్ డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

## అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

మల్లాపూర్, డిసెంబరు, 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్రెపల్లి గ్రామానికి చెందిన తోట రాజం(60) అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజం కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రిల్లో వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఆదివారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజం భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## చోరీ ఘటనలో ముగ్గురి అరెస్టు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో జరిగిన పలు చోరీ ఘటనల్లో కామారెడ్డి జిల్లా కామారెడ్డి, మాచారెడ్డి, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన ముగ్గురు వ్యక్తులు అర్జున్‌సింగ్, శ్రీకాంత్, గంగయ్యను అరెస్ట్ చేశామని ఎస్‌ఐ రమాకాంత్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన దాసరి అజయ్‌కుమార్ తన బైక్‌ను గొల్లపల్లిలో నిలుపగా చోరీకి గురైంది. ఈ నెల 21న మండల కేంద్రంలోని రెండో బైపాస్ రోడ్డులో కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి చెందిన శ్రీకాంత్ ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకొని విచారించడంతో బైక్‌ను దొంగిలించి కామారెడ్డిలోని అర్జున్‌సింగ్‌కు అమ్మకానికి ఉంచానని అంగీకరించాడు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, వెంకటాపూర్‌లో బైక్‌లను అపహరించడంతో పాటు లచ్చవ్వ ఇంటిలో చోరీకి పాల్పడిన గొల్లపల్లి వడ్డెర కాలనీ వాసి గంగయ్యను అదుపులోకి తీసుకుని విచారించారు. వెండి, బంగారు ఆభరణాలను అమ్ముకున్నానని వెల్లడించారు. రెండు ద్విచక్రవాహనాలు, నగదు స్వాధీనపర్చుకుని అర్జున్‌సింగ్, శ్రీకాంత్, గంగయ్యను అరెస్ట్ చేశామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

## రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన ఒకరి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యంను అక్రమంగా విక్రయించేందుకు నిల్వ చేసిన సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటకు చెందిన అనంతుల శ్రీనివాస్‌ను ఆదివారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రేషన్ బియ్యంను ఇంట్లో అక్రమంగా నిల్వచేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడని తెలుసుకున్న టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా 94 క్వింటాళ్లలో 39.54క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి శ్రీనివాస్‌ను అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచామని తెలిపారు.

# ఉపాధి కోసం.. ఊరూరా సంచారం

- ధనుర్మాసంలో గంగిరెద్దులవారి సందడి
- బసవన్నల విన్యాసాలు
- సంక్రాంతి వరకు పర్యటనలు

ధనుర్మాసంలో బసవన్నల సందడి ఎక్కువగా కనిపిస్తుంది. గంగిరెద్దుల వాళ్లు జీవనోపాధి వెతుక్కుంటూ ఊరూరా తిరుగుతారు. బసవన్నలను ఆడిస్తూ జనం ఇచ్చే డబ్బులు, ధాన్యం తీసుకుంటారు. బసవన్నల విన్యాసాలతో చిన్నాపెద్దను అలరిస్తారు. ఇలా ఏటా ఆరు నెలలపాటు గ్రామాల్లో సంచారం చేస్తూ మిగతా సమయాల్లో తమకున్న కొద్దిపాటి వ్యవసాయంతో కాలం వెల్లదీస్తారు. ఇంతకుముందులా జనం ఆదరణ లేకపోయినా.. బసవన్నల పోషణ భారమైనా కొంతమంది సంప్రదాయంగా వస్తున్న వృత్తినే అనుసరిస్తూ వస్తున్నారు.





(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ధనుర్మాసంలో సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తూ తెచ్చే కాంతులతో పల్లెలో పండుగ వాతావరణం కనిపిస్తుంది. ఈ సమయంలో గంగిరెద్దుల వాళ్ల నాదస్వరంతో పాడే పాటలు, తబలా వాద్యం రంగురంగుల దుస్తులతో బసవన్నలకు చేసే అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. విన్యాసాలతో చిన్న పిల్లలు, పెద్దలను అలరించే గంగిరెద్దులు సంక్రాంతి పండుగకు ప్రత్యేక శోభను తెస్తాయి.

ముఖ్యంగా సంక్రాంతి పండుగకు రైతుల కష్టం ఇంటికి చేరుతుంది. ధాన్య రాశులతో పల్లెల్లో ఇళ్ల వద్ద సందడి కనిపిస్తుంది. ధనుర్మాసం ప్రారంభంతోనే గంగిరెద్దుల వారు కూడా ఉపాధి వెతుక్కుంటూ బయల్దేరుతారు. మూడు నాలుగు కుటుంబాలు కలిసి గ్రామానికి చేరుకుంటాయి. ఊరి పెద్దను కలిసి ఇంటింటికీ తిరుగుతారు. ఆరు నెలల పాటు బసవన్నలతో పల్లెపల్లె తిరుగుతారు. గంగిరెద్దుల విన్యాసాలు చేయిస్తారు. చిన్నాపెద్దను అలరిస్తారు. ఇలా ప్రదర్శనిచ్చి ఆ ఊరు జనం ఇచ్చే ధాన్యం, డబ్బులు, పాత దుస్తులు తీసుకెళ్తారు.

### ప్రత్యేక అలంకరణ

బసవన్నలను రకరకాల దుస్తులతో అలంకరిస్తారు. గంగిరెద్దుల వారు కూడా సన్నాయి, బూర, డోలు, చేతిలో కంచుతో చేసిన చిన్న చేగుంట, నెత్తిన రంగుల తలగుడ్డా, మూతి మీద కోరమీసాలు, చెవులకు కమ్మల జోడు, నల్లకోటు, భుజం మీద కండువా, చేతికి వెండి మురుగులు, నోసట నామాలతో ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తారు. బసవన్న నోటిలో తమ మెడను ఇరికించి చూపిస్తారు. వాయిద్యానికి అనుకూలంగా గజ్జెలతో బసవన్న కూడా నృత్యం చేస్తాడు. గంగిరెద్దుతోపాటు గొర్రె పొట్టేలుతో కూడా రకరకాల విన్యాసాలు చేయిస్తారు.

### గంగిరెద్దులవారి జీవన శైలి

గంగిరెద్దుల వాళ్లలో మగవాళ్లు ఆరు నెలల పాటు పల్లెలో సంచారం చేస్తూ బసవన్నను ఆడిస్తారు. ఈ సమయంలో మహిళలు దువ్వెలను, పిన్నీసులు, పౌడర్లు వంటి అలంకార సామగ్రిని గంపలో వేసుకొని గ్రామాల్లో తిరిగి విక్రయిస్తారు. మిగతా ఆరునెలలపాటు తమకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయం ఇతర పనులు చేసుకుంటూ బసవన్నల పోషణను చూసు కుంటారు. గంగిరెద్దుల వారు పెద్దగా ఆర్భాటాలను పట్టించుకోరు. వారి వివాహాలు చిన్న వయస్సుల్లో జరుగుతుంటాయి. ముఖ్యంగా మేన కోడలును పెళ్లి చేసుకుంటారు. బతకడానికి అవకాశం ఉంటే పిల్లను ఇవ్వడానికి వెనుకాడరు. కట్నంగా కుక్కలు, గంగిరెద్దులను ఇచ్చుకుంటారు.

### ప్రతీ గ్రామం తిరుగుతాం

**పర్శరాములు**

గంగిరెద్దులతో ప్రతీ గ్రామం తిరుగుతాం. పెద్ద వాళ్లను కలుస్తూ ధాన్యాన్ని సేకరించుకుంటాం. ఒకప్పుడు ఆరు నెలలపాటు సంచారం చేసే వాళ్లం. ఇప్పుడు ఆదరణ కరువైంది. ధనుర్మాసంలో నెల రోజులపాటు తిరుగుతున్నాం. ఊరూరా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.



### ఆటను కాపాడుకుంటున్నాం

**నాంపల్లి**

ప్రతీ గ్రామంలో పెద్ద మనుషులు, సర్పంచులను కలిసి గంగిరెద్దుల ఆటను ఏర్పాటు చేసుకుంటాం. గంగిరెద్దుల ఆటను చూసి ధాన్యం, డబ్బులు ఇస్తారు. గతంలోలా ఇప్పుడు గంగిరెద్దుల ఆటను చూడడం లేదు. ప్రతీ సంవత్సరం సంచారం చేస్తూ ఆటను కాపాడుకుంటున్నాం.



### వస్తువులు అమ్ముకుంటాం

**గంగ రాజవ్వ**

మా మగవాళ్లు గంగిరెద్దులతో ఊళ్లోకి వెళ్తే మేము దువ్వెనలు, కాటిక డబ్బాలు, ఇతర వస్తువులు అమ్ముకుంటాం. ఊరూరు తిరుగుతాం. గతంలోలా ఎవరూ కొనడం లేదు. బతుకు భారంగా ఉంది. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.



# అటవీ భూముల ఆక్రమణకు యత్నం

- అధికారుల దృష్టికి తీసుకెళ్లిన

**ఆత్మకూర్ గ్రామస్థులు**


అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామ శివారులోని అటవీ భూముల ఆక్రమణకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఆదివారం ఆందోళన చేపట్టారు. గ్రామస్థులు చదును చేసిన అటవీ భూమిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి అన్యాక్రాంతం అవుతున్నాయని తెలిపారు. అటవీ భూమి చుట్టున్న పాటిమీదతండా గ్రామానికి సంబంధించిన వారితో పాటు ఇతర గ్రామస్థులు వందల ఎకరాల భూమిని కబ్జా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని గ్రామస్థులు మండిపడ్డారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కొన్ని రోజుల నుంచి తాము ఫిర్యాదులు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కొన్నిరోజుల నుంచి సుమారు వంద ఎకాల వరకు అటవీ భూమిలో ఉన్న చెట్లను తొలగించి సాగుకు చదును చేస్తున్నారని తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఆందోళన బాట పట్టామన్నారు. అటవీ భూమి అన్యాక్రాంతం కాకుండా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకుని అడవులను కాపాడాలని గ్రామస్థులు కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలపడంతో గ్రామస్థులు అక్కడి నుంచి తిరిగి వెళ్లారు.

## అంబేద్కర్, ఫూలేను స్ఫూర్తిగా తీసుకోవాలి


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

గోదావరిఖని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాఫూలేలను స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కాసిపేట లింగయ్య, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖనిలో ఫూలే, అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, ఫూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాసిపేట లింగయ్య మాట్లాడుతూ చదువు ఒక్కటే జ్ఞానాన్ని అందిస్తుందని, ప్రతి ఒక్కరూ చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే భారత ప్రజలకు రక్షణ కవచంగా ఉందన్నారు. కార్యక్రమంలో సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు పులి మోహన్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, న్యాతరి రాయమల్లు, కొంకటి లక్ష్మణ్, మంతెన లింగయ్య, బత్తుల శంకర్, ఇరుగురాల కృష్ణయ్య పాల్గొన్నారు.

## హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

ధర్మపురి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరెళ్ల సమీపంలోని అటవీ ప్రాంతంలో ఇటీవల ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్‌ప్రకాశసింగ్ హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్య చేసి శవాన్ని కాల్చి వేసిన బూడిద, ఎముకలను జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆదివారం పరిశీలించారు. రాహుల్‌ప్రకాశ్‌సింగ్‌ను మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన నేరేళ్ల గోపాల్, నేరేళ్ల గ్రామానికి చెందిన గండికోట శేఖర్ బండరాయితో కొట్టి చంపి శవాన్ని కాల్చి బూడిద చేశారు. ఆదివారం కాలిన బూడిద, ఎముకలను పోలీసులు సేకరించారు కొన్ని ఆధారాలు సేకరించి పక్కటెముకలు, వెన్నెముక భాగాలను సేకరించి హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. వైద్యాధికారి శ్రీనివాస్ నేతృత్వంలో పోస్ట్‌మార్టం చేసి బూడిద, ఎముకలను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. హత్య కేసులో ఇద్దరిని పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ధర్మపురి సీఐ రాజనర్సింహారెడ్డి, ఎస్సైలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.


ఎముకలు సేకరిస్తున్న పోలీసులు, క్లూస్ టీం

## పొలాసలో ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇల్లు

జగిత్యాలరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో ప్రమాదవశాత్తు ఓ ఇంటికి మంటలు అంటుకొని దగ్ధమై భారీగా నష్టం వాట్లింది. పొలాస గ్రామానికి చెందిన ఎడెల్లి గంగారాజం కుటుంబసభ్యులు గొల్లపల్లి మండలం మల్లన్నపేటలోని మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. ఈ సమయంలోనే ఘటన చోటు చేసుకుంది. ఇంట్లో దేవుడి దగ్గర పెట్టిన దీపం నుంచి పక్కనే ఉన్న టవల్‌కు మంటలు అంటుకుని ప్రమాదం జరిగినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీపం కారణంగా ప్రమాదం జరిగిందా.. లేదా షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిందా తెలియాల్సి ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరులేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంబాలాపూర్ గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మానకొండూర్ మండలం వేగురుపల్లి గ్రామానికి చెందిన మామిడి రంగస్వామి టీఎస్02యూసీ7303 అనే ట్రాక్టర్, టీఎస్02 యూసీ7341 అనే ట్రాలీలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాడు. వాహనాలను ఆపి తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

## సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 25 నుంచి 28 వకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, జీబీమా సాహెబ్, జిల్లా కమిటీ సభ్యుడు ఎడ్ల రమేష్, నాయకులు జి తిరుపతినాయక్, గజ్జల శ్రీకాంత్, సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపముఖ్యమంత్రి ఆదేశాలు బేఖాతర్


పెద్దాపూర్ గురుకుల పాఠశాల

- గురుకులాల్లో కానరాని కలెక్టర్, డీఎంహెచ్‌వో రాత్రి బస
- మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటనలు అసలే లేవు..
- ఇంటర్, పది తరగతులు మినహా ఇతర విద్యార్థులు ఇంటికి..

జగిత్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'పెద్దాపూర్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం ప్రభుత్వాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది... అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పెద్దాపూర్ గురుకుల పాఠశాల సందర్శనకు వచ్చాను... ఇక నుంచి గురుకుల పాఠశాలలో నెలలో ఒక రోజు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని నిర్ణయించాము... ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలు నెలలో ఒక రోజు ఒక గురుకుల పాఠశాలలో రాత్రి బస చేయాలి' ఇవి ఈ యేడాది ఆగస్టు 13వ తేదీన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు పాముకాటుకు గురై మృతి చెందిన నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాఠశాలను సందర్శించి న సందర్భంగా అన్న మాటలు...

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాటలు కార్యరూపం దాల్చలేదు. జగిత్యాల జిల్లాలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించిన సందర్భంగా తల్లిదండ్రులు, విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పలు హామీలు, సలహాలు, సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆయన పర్యటన జరిగి నాలుగు నెలల గడిచినప్పటికీ గడుస్తున్నా ఆ ఆదేశాలు మాత్రం అమలు కావడం లేదు. గురుకులాల్లో పనిచేసే వార్డెన్స్, టీచర్స్, పారామెడికల్ సిబ్బంది రాత్రి సమయాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నెలలో ఒకసారి కలెక్టర్, డీఎంహెచ్‌వో ఒక గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో రాత్రి బసచేస్తారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గడిచిన నాలుగు నెలల్లో జిల్లాలోని ఏ ఒక్క గురుకుల పాఠశాలలో అధికారుల రాత్రి బస, ఎమ్మెల్యేలు, మంత్రుల గురుకుల పాఠశాల సందర్శన జరగకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిలో మార్పు కనిపించకపోవడంతో విద్యార్థుల అస్వస్థతకు గురవుతున్న, పాముకాటు అనుమానాల వంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్న ఆరోపణలున్నాయి. పిచ్చిమొక్కలు తొలగించడం, చెత్తాచెదారం ఏరివేయడం, చిన్నచిన్న రిపేర్లు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తూ అధికారులు కొద్దిరోజులు హడావుడి చేసి తరువాత పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. పాఠశాల ఆవరణలో కొత్తగా నిర్మించిన భవనంలోకి తరగతులు, వసతిని మార్చినా శిథిలావస్థలో ఉన్న గదులను తొలగించలేదు.

పాఠశాలలో పారామెడికల్ సిబ్బందిని ఒకరిని నియమించినప్పటికీ సంబంధిత ఉద్యోగికి విద్యార్థుల వసతికి దూరంగా ఉన్న ఓపాత గదిని కేటాయించడంతో రాత్రి వేళలో అందుబాటులో ఉండడం లేదనే విమర్శలున్నాయి. విషపురుగులు, పాములు సంచరిం చే ప్రమాదమున్న ప్రాంతాలను దాటుకుంటూ సంబంధిత పారామెడికల్ ఉద్యోగి ఉండే గది వద్దకు వెళ్లాలంటే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

### ● చుట్టు పక్కల ప్రాంతాల్లో పంట పొలాలు..

పెద్దాపూర్ గురుకుల పాఠశాల చుట్టు పక్కల ప్రాంతాల్లో పంట పొలాలు ఉండడంతో విష పురుగులు, పాములు అక్కడి నుంచి అప్పుడప్పుడు పాఠశాలలోకి ప్రవేశిస్తున్నాయి. ప్రతీయేటా వరి కొయ్యలను తగులబెట్టినప్పుడు కానీ, పంటలకు విపరీతంగా మందులను పిచికారి చేసినప్పుడు కానీ విషపురుగులు ఇతర ప్రాంతాలకు వెళ్లే వీలుంది. ప్రతీ యేటా చుట్టు పక్కల గల వ్యవసాయం చేసుకునే రైతులతో గురుకులపాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు అవగాహన సమావేశం ఏర్పాటు చేస్తుండేవారని, యేడాదిన్నరగా ఎలాంటి సమావేశాలు జరగడం లేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఈనెల 19వ తేదీన రాత్రి ఇంటర్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. పాఠశాలలో రాత్రి సమయంలో బోండాలు అల్పాహారంగా అందించడంతో అవి తిన్న అనంతరం ఓ విద్యార్థి వాంతులు, మరో ఇద్దరు విద్యార్థులు కడుపునొప్పితో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వెంటనే విద్యార్థులకు ప్రాథమిక వైద్యం అందించారని, ప్రస్తుతం విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నట్లు సిబ్బంది తెలిపారు.

ఈ యేడాది జూలై 26వ తేదీన పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న రాజారపు గణాదిత్య తీవ్రఅస్వస్థతకు గురయి మృతి చెందాడు. పాముకాటు కారణంగా గణాదిత్య మృతి చెందినట్లు ప్రచారం జరిగింది. తల్లి రాజారాపు లావణ్య, తండ్రి మహేశ్ పేదతరగతికి చెందిన వారు. వీరి పెద్దకుమారుడు పుట్టిన మూడు రోజులకు అనారోగ్యంతో మృతి చెందాడు. రెండో కుమారుడు గణాదిత్య పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో చదువుకుంటూ పాముకాటుకు గురై మృతి చెందాడు. మూడో కుమారుడు రవికుమార్ తన మూడేళ్ల వయస్సులో తీవ్ర జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు. ముగ్గురు కొడుకులను కన్నప్పటికీ వివిధ కారణాల వల్ల ముగ్గురు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు పడుతున్న వేదన వర్ణణాతీతంగా మారింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ ప్రకారం తండ్రి మహేశ్‌కు కోరుట్ల

### ● అంతంత మాత్రంగానే సాయం..

మండలం కల్లూరు మోడల్ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై అటెండర్ ఉద్యోగం ఇచ్చారు. కానీ రెండున్నర నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు వేతనం చెల్లించకపోవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. అద్దె ఇంట్లో ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇంటి కింద రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించినప్పటికీ ఆదిశగా ప్రయత్నాలు ప్రారంభం కాలేదు. గణాదిత్య మృతిచెంది సుమారు నాలుగున్నర నెలలుగా గడుస్తున్నప్పటికీ పోస్టుమార్టం రిపోర్టును అధికారులు ఇవ్వడం లేదు. ప్రతీనిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని, పోస్టుమార్టం రిపోర్టు ఇవ్వడం లేదని గణాదిత్య తల్లి లావణ్య వాపోతోంది. తమ కుమారుడు ఏ కారణంగా మృతి చెందాడో..పోస్టుమార్టం రిపోర్టులో తెలిసే వీలుంటుందని, అధికారులు రిపోర్టు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తోంది. ఇప్పటికైనా సర్కారు కనికరించి ఇందిరమ్మ ఇల్లు, తండ్రి మహేశ్‌కు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, పోస్టుమార్టం రిపోర్టు ఇప్పించాలని లావణ్య వేడుకుంటోంది.

## రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తెల్లవారు జామునే కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని, ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకుని తరించారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సూపరిండెంట్ తిరుపతిరావు, ఆలయ ఇన్స్పెక్టర్ రాజేందర్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


## కొండగట్టులో భక్తుల సందడి


అంజన్న ఆలయంలో క్యూలో వస్తున్న భక్తులు


మల్యాల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వారంతపు సెలవు దినం కావడంతో దూర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు ఇతర అధికారులు పర్యవేక్షించారు

## మల్లెగుట్టపై మల్లన్న భక్తుల కోలాహలం

మల్యాల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మల్యాల శివారులోని మల్లెగుట్టపై ఆదివారం సట్టి సందడి నెలకొంది. వివిధ మండలాల నుంచి వచ్చిన భక్తులు మల్లెగుట్ట మల్లన్న సన్నిధిలో పట్నాలు, బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. నూతనంగా మెట్లదారి అందుబాటులోకి రావడంతో ఇటీవల భక్తుల రాక గణనీయంగా పెరిగినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.



సిరుల తల్లి... సింగరేణి ఒడిలో మరో వసంతం చేరనున్నది. బొగ్గు ఉత్పత్తితో మొదలైన తన జీవన గమనంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నది. ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ క్రమంగా తన మార్గాన్ని సుగమం చేసుకున్నది. కన్నబిడ్డల్లాంటి కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. ఆయా కుటుంబాల సామాజిక, ఆర్థిక ప్రయోజనాలను తన భుజస్కంధాలపై మోస్తోంది. మూడు తరాల వారికి విద్య, వైద్యం, సంక్షేమాన్ని అందిస్తోంది. మానవ పురోగతికి కీలకమైన విద్యుత్ తయారీలో కొత్త అధ్యాయాలను లిఖిస్తోంది.'సిరుల తల్లి' సింగరేణి సంస్థ సోమవారం తన 136వ పుట్టిన రోజు వేడుకను జరుపుకోనున్నది.



# సిరుల తల్లి ఒడిలో.. మరో వసంతం

- బహుళ రంగాలకు విస్తరించిన సింగరేణి
- ఇతర రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తికి ప్రణాళికలు
- రూ.35వేల కోట్ల వార్షిక టర్నోవర్
- నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం

గోదావరిఖని, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తయారీకి మూల ఇంధనమైన బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి రారాజుగా నిలుస్తోంది. ఏటా 70మిలియన్ టన్నులు బొగ్గు ఉత్పత్తి చేస్తున్నది. దశాబ్దం క్రితమే విద్యుత్ రంగంలో ప్రవేశించిన సింగరేణి థర్మల్, సోలార్, విండ్ విద్యుత్ ఉత్పత్తి రంగాల్లో కూడా ముందుకు సాగుతున్నది. సంపడ్ స్టోరేజీ ప్లాంట్ల సాంకేతికతను తీసుకువచ్చి విద్యుత్‌ను నిల్వచేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. విద్యుత్, బొగ్గును ఆధారం చేసుకుని హైడ్రోజన్, మిథనాల్ వంటి ఇంధనాల తయారీకి సంసిద్ధమవుతున్నది.

ఇది సింగరేణిలో విప్లవాత్మక మార్పు. వంద ఏళ్లకు పైగా అనుభవం ఉన్న సింగరేణి దేశంలో బొగ్గు పరిశ్రమలకు సాంకేతిక, సామాజిక దార్శనీకతను అందిస్తున్నది. రాష్ట్రంలోనే కాకుండా ఒడిశాలో కూడా బొగ్గు బ్లాకులను తీసుకుని ఉత్పత్తికి సిద్ధమైంది. ఒడిశాలో కూడా విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి సింగరేణి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నది.

### ప్రభుత్వాలకు ఆర్థిక దన్నుగా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సింగరేణి ఆర్థిక దన్నుగా నిలుస్తోంది. జీఎస్టీ, కోల్ సేస్ తదితర రకాల పన్నుల రూపాల్లో ఏటా రూ.7వేల కోట్లు సింగరేణి ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరుతున్నాయి. 49శాతం కేంద్ర ప్రభుత్వం, 51 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా దామాషాలో అంటే సుమారు 3700కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి, 3300కోట్లు కేంద్ర ప్రభుత్వానికి ప్రతి ఏటా సింగరేణి చెల్లిస్తోంది. అంతేకాకుండా సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతి సంవత్సరం రూ.600 కోట్లను కోల్‌బెల్ట్ ప్రభావిత ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చిస్తున్నది. వందల కోట్ల రూపాయలతో మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నది.

ఇలా ప్రభుత్వాలు, ప్రాంతాలకు ఉపయోగపడుతున్న సింగరేణి కార్మికులకు కూడా లాభాల్లో 33శాతం వాటా చెల్లిస్తున్నది. బోనస్‌లు, లాభాల వాటాలు, సరాసరిగా రూ.500 కోట్ల నుంచి సుమారు రూ.700 కోట్లు కార్మికులకు వేత నాలు కాకుండా పంచి పెడుతున్నది. ప్రతి సంవత్సరం రూ.35వేలకోట్ల టోర్నవర్‌తో నడుస్తున్న సింగరేణి కాలరీస్ సంస్థ తాను ప్రభుత్వాలకు చెల్లించే పన్నులు కాకుండా సంస్థ లాభాలపై ఆదాయ పన్ను, 40వేల మంది కార్మికుల వేతనాల మీద ఆదాయ పన్ను, జీఎస్టీల రూపంలో వందల కోట్లు పరోక్షంగా ప్రభుత్వాలకు చేరుతున్నాయి.

### కాంట్రాక్టు కార్మికులకూ అండగా..

సింగరేణి సంస్థ 40వేల మంది కార్మికులకు ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా ఉపాధి కల్పిస్తుండగా, 30వేల మంది కాంట్రాక్టు కార్మికులను కూడా ఆదరిస్తున్నది. కార్మికుని కుటుంబానికి, పిల్లలకు, పెళ్లి చేసుకుని వెళ్లిన ఆడపిల్లలకు, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం తన ఖర్చుతోనే భరిస్తున్నది. ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే కోటి రూపాయలు పరిహారంగా ఇస్తున్నది. అనారోగ్యంతో కార్మికుడు మెడికల్ అన్‌ఫిట్ అయితే వారసులకు ఉద్యోగం కల్పించి ఆ కుటుంబంలో ధైర్యాన్ని నింపుతున్నది. ఇలా వివిధ రంగాల్లో సింగరేణి అభివృద్ధి చెందుతూ, రాష్ట్ర ప్రగతికి దోహదపడడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నది.



## కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ ఆవరణలోని శ్రీకాలభైరవ స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో కాలభైరవాష్టమి సందర్భంగా ప్రదోష పూజ అనంతరం పంచామృతాలతో అభిషేకం చేశారు. అష్టమి రోజున కాలభైరవ స్వామి వారికి పూజలు నిర్వహిస్తే మంచి శకునాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నమిలకొండ ఉమేష్, గోపన్నగారి చందు, గర్షకుర్తి శ్రీదర్ తదితరుల ఉన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వడుకాపూర్ విద్యార్థిని ఎంపిక


జన్వితతో ఉపాధ్యాయులు

జూలపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కాట జన్విత జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎలగం మహేందర్ తెలిపారు. తొమ్మిదో తరగతి చదువుతున్న జన్విత పెద్దపల్లిలో ఈనెల 14న నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభను కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 23,24,25 తేదీల్లో మేడ్చల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాపోటీల్లో పాల్గొననున్నట్లు మహేందర్ తెలిపారు. జన్వితను ప్రధానోపాధ్యాయుడు రమేష్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

## ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ పోటీల విజేత కరీంనగర్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సీఎం కప్ హ్యాండ్‌బాల్ పోటీల్లో బాలబాలికల విభాగాల్లో విజేతగా కరీంనగర్ జట్లు నిలిచాయి. కరీంనగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయి సీఎం కప్ హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహిం చారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో సిరిసిల్ల జట్టు, బాలికల విభాగంలో జగిత్యాల జట్టు ద్వితీయ స్థానాల ను సాధించాయి. జిల్లా యువజన క్రీడాధికారి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ యాదగిరి సుజిత్‌రావు, డైరెక్టర్ పొల్సాని శిరీషలు ముఖ్యఅతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్ ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేని లక్ష్మణ్, పెటా సంఘం అధ్యక్షులు ఎ శ్రీనివాస్, వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర ఖో-ఖో సంఘ రెఫరీస్ బోర్డు కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాశ్, పీడీలు బాబు శ్రీనివాస్, ఎ శ్రీనివాస్, తిరుమలేశ్, శ్రీనివాస్, కోచ్ మూల వెంకటేశ్, ప్రేమ్, శ్రీధర్, అశోక్, వీర్‌పాల్, అమర్‌సాయి, దుర్గరాజు, శివాజీ, రాజు, రమేశ్, హరికృష్ణ పాల్గొన్నారు.


కరీంనగర్ బాలికల జట్టుతో అతిథులు

## కల్వకుంట్ల కుటుంబానికి కౌశిక్‌రెడ్డి దాసోహం: ఎమ్మెల్సీ

జమ్మికుంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కల్వకుంట్ల కుటుంబానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దాసోహం అయ్యాడని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. జమ్మికుంటలో ఇటీవల మృత్యువాత పడిన వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గ సమస్యలపై చర్చించేందుకు స్పీకర్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి సమయం ఇస్తే దాన్ని పక్కన పెట్టి, కేటీఆర్‌కు వత్తాసు పలుకుతూ స్పీకర్‌పై ఫ్లకార్డులు విసరడం సిగ్గుచేటన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దాసోహం అయ్యాడన్నారు. ఎన్నికల సమయంలో ఇంది రానగర్-శాలపల్లి గ్రామాల మధ్య బీఆర్ఎస్ మీటింగ్‌కు వస్తూ ఇద్దరు రోడ్డుప్రమాదంలో మృతి చెందారని, ఆ సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల చొప్పున ఇస్తానని చెప్పిన కౌశిక్‌రెడ్డి ఇప్పటి వరకు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎన్నికలకు ముందు దళితబంధు రెండోవిడత ఆపింది కౌశిక్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

## ధర్మపురి గోదావరి వద్ద మల్లన్న భక్తుల రద్దీ

ధర్మపురి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద ఆదివారం మల్లన్న భక్తుల రద్దీ పెరిగింది. సట్టి వారోత్సవాలను పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తులు నెత్తి మీద మల్లికార్జున విగ్రహాల పెట్టెను పెట్టుకుని ధర్మపురి క్షేత్రానికి తరలివచ్చారు. అనంతరం గోదావరి నదిలో స్నానాలు చేశారు. అలాగే నదీ జలాలతో విగ్రహాలను శుభ్రం చేసి స్నానఘట్టాల పైన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇసుక లింగాల వద్ద ఉంచి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు త్రిశూలం, ఒగ్గు డోలు చేత పట్టుకుని మెడలో పూల దండ వేసుకుని భక్తిపాటలు పాడుతూ భక్తులు విగ్రహాల పెట్టెలతో తిరుగు ప్రయాణం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గోదావరి నది వద్ద మల్లన్న భక్తులతో సందడి నెలకొంది. గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన అనేక మంది భక్తులు స్థానిక లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## రైఫిల్ షూటింగ్ పోటీల్లో విద్యార్థినికి పతకం

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో కరీంనగర్ జిల్లాకు చెందిన క్రీడాకారిణి కె వర్షిత పతకం సాధించింది. జిల్లా కేం ద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న వర్షిత ఎయిర్ రైఫిల్ విభాగంలో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించి ఐదో స్థానంతో పతకం సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణిని కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, కరీంనగర్ జిల్లా రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్‌రావు, కె ప్రసాద్, కెఎస్ రత్నాకర్ అభినందించారు.

# మహిళలు, పిల్లలకు భరోసా

- రాష్ట్రంలో మావోయిస్టులు లేరని చెప్పలేదు
- భరోసా సెంటర్ ప్రారంభోత్సవంలో డీజీపీ డాక్టర్ జితేందర్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భరోసా కేంద్రంతో బాలికలకు, మహిళలకు మరింత భద్రత కలుగుతుందని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. భరోసా కేంద్రాల ద్వారా పోలీసు, వైద్య, న్యాయసేవలు, మానసిక ప్రోత్సాహం ఒకే గూడు కిందకు వస్తాయని ఆయన తెలిపారు. ఆదివారం కరీంనగర్ శివారులోని కొత్తపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరితో కలిసి డీజీపీ ప్రారంభించారు. డీజీపీకి కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి పూల మొక్కతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీజీపీ భరోసా సెంటర్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం భరోసా సెంటర్‌లో వివిధ విభాగాలు బాధితులకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో భరోసా సెంటర్‌ను వెయ్యి గజాల స్థలంలో అన్ని వసతులతో అద్భుతంగా నిర్మించామన్నారు. భరోసా కేంద్రాల ఏర్పాటు కేవలం తెలంగాణలోనే ఉందని, సుప్రీంకోర్టు బృందం కూడా భరోసా కేంద్రాన్ని పరిశీలించి అభినందించిందన్నారు. ఇతర రాష్ట్ర పోలీసులు ఈ భరోసా కేంద్రాలను సందర్శిస్తున్నారని అన్నారు. లైంగిక వేధింపులకు గురైన మహిళలకు, సురక్షిత వాతావరణంలో చేయూత అందించేందుకే రాష్ట్ర పోలీసుశాఖ, ఉమెన్ సేఫ్టీవింగ్ ఆధ్వర్యంలో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రాలు మంచి ఫలితాలనిస్తున్నాయని అన్నారు. భరోసా కేంద్రం ద్వారా పోక్సో కేసుల బారిన పడిన బాధితులకు తక్షణ సహాయం అందించడంతో పాటు ఎఫ్ఐఆర్ నుంచి మొదలుకొని కోర్టుల్లో శిక్షలు పడే వరకు బాసటగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 27 భరోసా కేంద్రాలు నడుస్తున్నాయని తెలిపారు. భరోసా సెంటర్లలో లీగల్ ఎక్స్‌పర్ట్స్, వైద్యులు, కౌన్సెలింగ్ టీం 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. భవిష్యత్‌లో అన్ని జిల్లా కేంద్రాల్లో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని డీజీపీ తెలిపారు.



భరోసా కేంద్రంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీజీపీ జితేందర్, సిబ్బందితో మాట్లాడుతున్న డీజీపీ

**● పౌరుల భద్రతే ముఖ్యం..**

కరీంనగర్ భరోసా కేంద్రంలో ఏడుగురు సిబ్బంది ఉంటారని డీజీపీ అన్నారు. ఇప్పటికే ఐదుగురిని నియమించామని మరిన్ని నియామకాలు త్వరలో చేపడుతామన్నారు. పోక్సో కేసుల్లో శిక్షల శాతం గతంలో కంటే పెరిగిందన్నారు. ఎస్‌బీఐ సీఎస్ఆర్ నిధులతో కరీంనగర్‌లో భరోసా సెంటర్‌ను నిర్మించామని, వారికి డీజీపీ అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ చాలా బాగా పనిచేస్తుందన్నారు. పౌరుల భద్రత కంటే సినిమా ప్రమోషన్ ముఖ్యం కాదని డీజీపీ స్పష్టం చేశారు. అల్లు అర్జున్ సినిమా హీరో అయినప్పటికీ ఆయన బయట సామాన్యుడేనని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను అర్థం చేసుకుని మెదలాలన్నారు. వ్యక్తిగతంగా తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, పౌరులందరూ బాధ్యతగా మెదలాలని సూచించారు. సంధ్య థియేటర్ ఘటన దురదృష్టకరమని, చట్టం ప్రకారం అల్లు అర్జున్‌పై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. మోహన్‌బాబుది కుటుంబ గొడవని, వారు కొంత మారారని అన్నారు. జర్నలిస్టుపై దాడి ఘటనలో మంచు మోహన్‌బాబుపై కేసు నమోదు చేశామని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీజీపీ తెలిపారు.

రాష్ట్రంలో మావోయిస్టులు లేరని తాము చెప్పలేదని, ఈ మధ్యకాలంలో వారు రాష్ట్ర సరిహద్దులో ఇద్దరిని ఇన్‌ఫార్మర్ల పేరిట చంపారన్నారు. ప్రజాశ్రేయ స్సు దృష్ట్యా ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఫైర్ జరిగిందని డీజీపీ అన్నారు. విలేకరుల సమావేశంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరి, పోలీస్ కమిషనర్ అభిషేక్‌మొహంతి, శిక్షణ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరబి, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, భరోసా కేంద్రం ఇన్‌చార్జి ఏసీపీ మాధవి, సీఐ శ్రీలత, ఎస్‌బీఐ అధికారులు పాల్గొన్నారు.

### కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం

కరీంనగర్ పోలీస్ కమిషనర్ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అస్త్ర కన్వెన్షన్ సెంటర్, ది కాప్ కెఫెలను డీజీపీ డాక్టర్ జితేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దిన అస్త్ర ఏసీ కన్వెన్షన్ సెంటర్, ది కాప్ కెఫెలు అధికారులు, సిబ్బందికి అత్యంత తక్కువ ధరల్లో అందించేలా చర్యలు తీసుకున్నందుకుగాను కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిని అభినందించారు. పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ అస్త్ర కన్వెన్షన్ సెంటర్‌ను కమిషనరేట్ కేంద్రంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించామన్నారు. ఈ హాలును సిబ్బంది కుటుంబ శుభకార్యాలకు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బందికి అత్యంత నాణ్యతతో కూడిన ఆహారం, స్నాక్స్ అల్పాహారం అందించేలా ది కాప్ కెఫెను నిర్మించామన్నారు. సోమవారం నుంచి ఈ రెండు కరీంనగర్ పోలీసులకు అందుబాటులోకి




# ప్రభుత్వ ఉద్యోగులకు కేరాఫ్ చెంజర్ల

- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం
- ఓకే ఊరిలో 150కి పైగా ప్రభుత్వ ఉద్యోగులు

మానకొండూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాడు కరువు కాటకాలతో సతమతమై నేడు 150కి పైగా ప్రభుత్వ ఉద్యోగులకు చిరునామాగా నిలుస్తోంది మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామం. చెంజర్ల గ్రామం గతంలో కమ్యూనిస్టులకు అడ్డాగా ఉండేది. కాకతీయ కాలువ గ్రామానికి దిగువ నుంచి వెళ్లడంతో సాగునీరు అందక పోయేది. ఎటుచూసినా బీడు భూములే కనిపించేవి. గ్రామస్థులు పనులు లేక భీవండి, ముంబాయి లాంటి ప్రాంతాలకు వలస వెళ్లేవారు.

### చదువుతోనే భవిష్యత్తు ఉంటుందని..

తరాలు మారాయి.. చదువుతోనే భవిష్యత్తు బాగుంటుందని నమ్మిన చెంజర్ల యువత పట్టుదలతో చదివారు. 2006 డీఎస్సీలో గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించారు. అంతే వారి కుటుంబాల పరిస్థితి మారిపోయింది. వారిని స్ఫూర్తిగా తీసుకుని కొత్త తరానికి చెందిన వారు చదువుపై దృష్టి సారించారు. ఏ నోటిఫికేషన్ వెలువడినా ఉద్యోగాలు సాధించిన వారి సూచనలతో ప్రిపేర్ కావడం ప్రారంభించారు. ప్రస్తుతం గ్రామంలో 150 మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. గ్రామంలో 3,067 మంది జనాభా ఉంది. గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు బొల్లబత్తుల అంజనేయులు, మార్కండేయ, శ్రీనివాస్ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యేవారిని ప్రోత్సహించారు. 2012 డీఎస్సీలో ఈ గ్రామానికి చెందిన 18 మంది యువకులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఈ గ్రామానికి చెందిన వారు 70 మందికి పైగా ఉపాధ్యాయులుగా ఉద్యోగం చేస్తున్నారు. మరో 80 మంది వివిధ రంగాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా కొనసాగుతున్నారు.

### పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే..

**బైరి మార్కండేయ, జూనియర్ లెక్చరర్**



పట్టుదల ఉంటే ఏదైన సాధించవచ్చు. పట్టుదలతో చదవి 2012 టెట్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాను. తర్వాత డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయాను. ఇటీవల ప్రకటించి జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యాను.

### తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించాను..

**సుదగోని స్వప్న, డిగ్రీ లెక్చరర్**



మాది వ్యవసాయ కుటుంబం.. తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో పట్టుదలతో చదివాను. 2016లో కరీంనగర్‌లోని డిగ్రీ కళాశాలలో అతిథి లెక్చరర్‌గా పని చేశాను. 2019 ఆగస్టులో సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాను.

# చల్పాక ఎన్‌కౌంటర్ బూటకం

**- పౌర హక్కుల సంఘం డిమాండ్**

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చల్పాకలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని, కోవర్టు వ్యవస్థ ద్వారా విషయ ప్రయోగం చేసి మావోయిస్టులను పోలీసులు కాల్చి చంపారని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ ఆరోపించారు. చల్పాక అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని పౌర హక్కుల సంఘం సభ్యులు ఆదివారం పరిశీలించారు. అనంతరం రాత్రి ఏటూరునాగారంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్‌కౌంటర్‌పై తాము నిజనిర్ధాణ కోసం వస్తుంటే పోలీసులు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారని మండిపడ్డారు. నిజాలు బయటకు వస్తాయనే భయంతోనే కుట్రపూరితంగా వ్యవహరించారని విమర్శించారు. చల్పాకలో ఎదురుకాల్పులు జరగలేదని తెలిపారు. చెట్లకు తూటాలు జరిగినట్టు సంఘటన స్థలంలో ఆధారాలు లేవన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన వాగులో ఇప్పటికీ రక్తం తడి ఆరాలేదని, ఇరువర్గాల మధ్య కాల్పులే జరిగి ఉంటే సంఘటన స్థలంలో వేరే పరిస్థితులుండేవని అన్నారు. పోలీసులు, ప్రభుత్వాలు ప్రజల గొంతును నొక్కుతున్నారని, సత్య శోధన చేసే సంస్థలపై నిర్బంధాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు. కొన్ని నెలలుగా రాష్ట్రంలో భయకంపిత వాతావరణంలో నెలకొందన్నారు. రఘునాథపాలం, చల్పాక, దామరతోగులో జరిగిన ఎన్‌కౌంటర్లలో నిజనిజాలు బయటి ప్రపంచానికి తెలియకుండా పోలీసులు, కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నాయని మండిపడ్డారు. నాలుగు నెలల కాలంలో 14 మందిని చంపించిన ప్రభుత్వానిది ప్రజా పాలన ఎలా అవుతుందని ప్రశ్నించారు. నిర్బంధంలో గత ప్రభుత్వానికి, నేటి కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య తేడా లేదని వ్యాఖ్యానించారు. అడవిలో ఉన్న గ్రేహౌండ్స్ బలగాలను వెనక్కి తీసుకున్నప్పుడే ప్రజాపాలన అవుతుందన్నారు. ఎన్‌కౌంటర్‌పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక మంత్రి ఇప్పటి వరకు ఒక్క మాట కూడా ఎన్‌కౌంటర్‌పై మాట్లాడలేదని, కేంద్రం పేరు చెప్పి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామి అయ్యిందని ఆరోపించారు. ఇప్పటి వరకు 287 మందిని బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో కగార్ ఆపరేషన్ ద్వారా హత్యచేశారని విమర్శించారు. మావోయిస్టుల ఉద్యమం పట్ల పాలసీ విధానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీ ప్రధాన కార్యదర్శి చిలుక చంద్రశేఖర్, రాష్ట్ర కమిటీ కార్యదర్శి తిరుమలయ్య, సహాయ కార్యదర్శి కుమారస్వామి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్, నాయకులు జయంత్, రంజిత్, ప్రవీణ్, నారా వినోద్ తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారంలో విలేకరుల సమావేశంలో పాల్గొన్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ

## న్యూస్ బాక్స్

### ఎమ్మెల్యే పరామర్శ

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్‌ను ఆదివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. రాజేష్ ఆరోగ్య స్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రాజేష్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మారంగుల రమేష్, కృష్ణవేణి, ఆరెపల్లి హరీష్, కోట రవి ఉన్నారు.

### మాజీ మంత్రి పరామర్శ

ధర్మారం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) ధర్మారం మాజీ ఉపసర్పంచ్ ఆవుల లత భర్త ఆవుల శ్రీనివాస్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకోగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఆదివారం ధర్మారంలోని ఆయన ఇంటికి కొప్పుల చేరుకొని ఆరోగ్య పరిస్థితులు అడిగితెలుసుకున్నారు.మేడారం ప్యాక్స్ చైర్మెన్ ముత్యాల బలరాంరెడ్డి, ధర్మారం మాజీ సర్పంచ్ పూస్కురి జితేందర్‌రావు, మాజీ ఎంపిటీసీ తుమ్మల రాంబాబు తదితరులు ఉన్నారు.

### క్షయ వ్యాధిపై అవగాహన

సుల్తానాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గర్రెపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుల్తానాబాద్‌లోని శ్రీరామ్‌నగర్, సుభాష్‌నగర్‌లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రజలకు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతు అవగాహన, నివారణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనుదీప్, సింధూజ, వెంకటొరెడ్డి, ఏఎన్ఎం సరస్వతి, శారద, ఆశాలు, మరియమ్మ, స్వప్న రమాదేవి పాల్గొన్నారు.

# ఎట్టకేలకు డీ-83 ఉపకాలువ శుద్ధి..

**- చెత్తాచెదారం, చెట్ల తొలగింపు**
**- తొలగనున్న చివరి ఆయకట్టు రైతుల నీటి సమస్య**

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : డీ 83 ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు రైతుల నీటి సమస్య తీరనున్నది. దశాబ్దాల కాలంగా సాగునీరందక వేసిన రైతులు వేసిన పంటలు వేసినట్లే ఎండిపోయి తీవ్ర నష్టానికి గురయ్యారు. దీనిపై ఎన్నోసార్లు ధర్నాలు, ఆందోళనలు చేపట్టినా ఎవరూ పట్టించుకోలేదు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సారెస్పీ కాలువను నరిశీలించిన ఎమ్మెల్యే పరిష్కారానికి చర్యలు చేపట్టారు. డీ 83 ఉప కాలువ చివరి ఆయకట్టుకు కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేట్, ఎదులాపూర్, పెద్దరాతుపెల్లి గ్రామాలకు చెందిన రైతులు పంటలు సాగు చేస్తారు. అయితే వీరికి ప్రతి ఏటా రెండు పంటలకు సరిగ్గా నీరందక పంటలు ఎండిపోతున్నాయి. ఈ కెనాల్ కింద సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంటుంది. పెద్దపల్లి మండలం చందపల్లి కెనాల్ నుంచి 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే చివరి ఆయకట్టు వరకు 30 నుంచి నలభై క్యూసెక్కుల నీరు చేరుతోంది. కెనాల్ చెత్తాచెదారం నిండిపోవడంతో కేవలం 120 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితి గమనించిన ఎమ్మెల్యే ఇరిగేసన్ అధికారు లతో కలిసి కాలువను పరిశీలించారు. కాలువ కేపాసీటి 200 క్యూసెక్కులకు పెంచేందుకు చర్యలు చేపట్టారు. చందపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ వరకు కాలువ గట్టుపై ఇరువైపులా ఉన్న చెట్లను, పిచ్చిమొక్కలను తొలగించారు. కాలువలో పేరుకపోయిన చెత్తాచెదారం తీసివేయ డంతో పాటు కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలను తీసివేయిస్తున్నారు. దీంతో తమ కష్టాలు తొలగనున్నాయని చివరి ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కాలువలోని చెత్తాచెదారం, చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్



ఖనిలో నివాళులర్పిస్తున్న మాల సంఘం నాయకులు



జూలపల్లిలో కాకా విగ్రహానికి పూలమాలలు వేస్తున్నా నాయకులు



ధర్మారంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు

## 'కాకా'కు ఘన నివాళి

కేంద్ర మాజీ మంత్రి, పెద్దపల్లి మాజీ ఎంపీ దివంగత గడ్డం వెంకటస్వామి వర్ధంతిని ఆదివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. పెద్దపల్లి, మంథని, యైటింక్లయిన్ కాలనీ, ఎలిగేడు, జూలపల్లి, ధర్మారం, ఓదెల తదితర ప్రాంతాల్లో 'కాకా' విగ్రహాలు, చిత్రపటాలకు అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ ప్రాంతానికి 'కాకా' చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

వెంకటస్వామి ఆశయ సాధనకు

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

## మారనున్న 'స్థానిక' ముఖచిత్రం

(5వ పేజీ తరువాయి)

దీనిని ఆయా గ్రామాల ప్రజలు వ్యతిరేకించినప్పటికీ విలీన ప్రక్రియ నిలువరించలేదు. పంచాయతీ ఎన్నికలు పూర్తయిన తర్వాత మున్సిపల్ ఎన్నికలకు ముందు ఆ గ్రామాలకు విలీనం నుంచి అప్పటి ప్రభుత్వం విముక్తి కల్పించింది. కానీ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేకుండా పోయింది. ఎల్కలపల్లి పంచాయతీలోని రెండు వార్డులను 8వార్డులుగా చేసి ఎల్కలపల్లి గేట్ పంచాయతీగా ఏర్పాటుచేశారు. ఈ పంచాయతీల్లో ఐదేళ్లుగా ప్రత్యేక అధికారుల పాలనలోనే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం పదేళ్ల రిజర్వేషన్ విధానానికి చట్ట సవరణ చేయడంతో ఆ పంచాయతీలకు మార్గం సుగమం అయ్యింది. అలాగే జిల్లాలో కొత్తగా మరో రెండు గ్రామపంచాయతీలు ఏర్పడ్డాయి. మంథని మండలం లక్కేపూర్ పంచాయతీ పరిధిలోని తోటగోపయ్యపల్లి, ముత్తారం మండలం ఖమ్మంపల్లి పంచాయతీలోని జిల్లెల్లపల్లి పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. వీటికి కూడా ఎన్నికలు జరగనున్నాయి.

### పెరగనున్న ఎంపీటీసీ స్థానాలు..

జిల్లాలోని 13 రూరల్ మండలాల్లో 137 ఎంపీటీసీ స్థానాల సంఖ్య పెరగనున్నది. ప్రతి మండలంలో 5కు తగ్గకుండా ఎంపీటీసీ స్థానాలు ఉండాలని చట్టసవరణ చేశారు. గతంలో 3 నుంచి 4 వేల జనాభాకు ఒక ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేశారు. అంతర్గాం మండలంలో 5, ధర్మారంలో 15, ఎలిగేడులో 6, జూలపల్లిలో 9, కమాన్‌పూర్‌లో 6, మంథనిలో 11, ముత్తారంలో 8, ఓదెలలో 12, పాలకుర్తిలో 11, పెద్దపల్లిలో 17, రామగిరిలో 12, కాల్వశ్రీరాంపూర్‌లో 12, సుల్తానాబాద్ మండలంలో 13 స్థానాలున్నాయి. ప్రతి మండలంలో ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు ఉండాలనే నిబంధన మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో 6కు తగ్గకుండా ఉన్నారు. ఒక్కో ఎంపీటీసీ స్థానం జనాబాను 250కి తగ్గించినట్లయితే జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోగల జనాభా 4,87,823ను అనుసరించి ఎంపీటీసీ స్థానాల డీలిమిటేషన్ చేసినట్లయితే మరో 60 స్థానాల వరకు పెరగవచ్చని అంచనా. ఒకవేళ డీలిమిటేషన్ చేయకుంటే మాత్రం అంతర్గాం, రామగిరి మండలాల్లో కుందనపల్లి, లింగాపూర్, వెంట్రావుపల్లి పంచాయతీలను పరిగణనలోకి తీసుకుంటే మూడు నుంచి నాలుగు స్థానాలు పెరగవచ్చు.

## విద్యార్థులకు కూచిపూడి నృత్యంపై అవగాహన

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో సృజనాత్మక కళను వెలికితీసేందుకు హార్ట్ ఎడ్యుకేషన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కూచిపూడి నృత్య కళాకారిణి గుమ్మడి ఉజ్వల చెప్పారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు కూచిపూడి లైఫ్‌టైం ప్రాజెక్టు కోసం తెలంగాణ రూరల్ ప్రాంతాల్లోని స్కూల్స్, క్లబ్‌ల్లో శాస్త్రీయ నృత్య కళలో మూడు నెలల శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఉత్తర తెలంగాణలో శాస్త్రీయ కళ కనుమరుగవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హార్ట్ అవర్నెస్ ప్రోగ్రాంతో ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని, ప్రభుత్వ స్కూల్‌లో విద్యార్థులకు మూడు నెలల శిక్షణనిచ్చి కూచిపూడి నృత్యబృందాన్ని తయారు చేయనున్నట్టు చెప్పారు. మద్దెల దినేష్, గడ్డం శ్యాం, మ్యాజిక్ హరి పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

**తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు**

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలే దీక్షకు ఆదివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మద్దతు ప్రకటించింది. జిల్లా ప్రధానకార్యదర్శి దుగ్యాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్లు న్యాయపరమైనవని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నేరవేర్చాలని సూచించారు. జిల్లా ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి దిలీప్ రావు, అశోక్ రాజు, వెంకటేశ్వర్లు సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా సైడ్‌వాల్



ప్రమాదకరంగా ఉన్న కాలువ సైడ్‌వాల్

ఎలిగేడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణపల్లి, బురహన్‌మియాపేటల మధ్యలోని కాలువ బ్రిడ్జి సైడ్‌వాల్ ప్రమాదకరంగా మారింది. దీనిపై నుంచి రెండు గ్రామాల ప్రజలు, రైతులు నిత్యం వాహనాలపై వెళుతుంటారు. సైడ్‌వాల్ కూలిపోయి ప్రమాదకరంగా మారిందని, ఇప్పటికైనా ఎస్సారెస్పీ అధికారులు మరమ్మతులు చేయాలని రెండు గ్రామాల రైతులు కోరుతున్నారు.

## వ్యాపారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా..

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) వ్యాపారస్తుల ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాంబర్ కామర్స్ కార్యాలయానికి రెండు గుంటల స్థలం ఇవ్వడంతో భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారస్తుల ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తామనని హామీఇచ్చారు. హోటళ్ళు, పాన్ షాపులు రాత్రి 11గంటల వరకు తెరిచి ఉంచేందుకు డీసీపీతో చర్చిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కమల్ కిషోర్, జనరల్ సెక్రెటరీ సయ్యద్ మస్రత్, కోశాధికారి జయప్రకాష్, వినోద్‌కుమార్, పరమేష్, నర్సింగరావు, గంగుల రవి, ప్రకాష్, శ్రీనివాస్, బాలకిషన్ జకోటియ, ఎంఏ మోయుద్, ఫైడా లక్ష్మయ్య, పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

## సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు గౌతం గోవర్ధన్ శ్రేణులకు సూచించారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సీపీఐ కమాన్‌పూర్ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా గౌతం గోవర్ధన్ మాట్లాడారు. 1925డిసెంబరు 26న కాన్పూర్‌లో పార్టీ ఆవిర్భవించినట్లు తెలిపారు. ఈనెల 26న ప్రతి శాఖలో కార్యకర్తలు పార్టీ పతాకాలను ఆవిష్కరించాలన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి రాజారత్నం, జిల్లాకౌన్సిల్ సభ్యుడు ఎల్ ప్రకాష్, నాయకులు జాడి అంజనేయులు, అన్నారావు, ఎజ్జ రాజయ్య, రాజయ్య, రామ్మూర్తి, మహేందర్, శంకర్ పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఏర్పాటు కోసం ముమ్మర ప్రయత్నాలు

ఎలిగేడు, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పెద్దపల్లిలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో ఎలిగేడులో పోలీస్ ఠాణాను ఏర్పాటుచేస్తామని ప్రకటించిన నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా మూడుసార్లు సుల్తానాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి, ఏసీపీ గజ్జి కృష్ణ ఇతర పోలీస్ అధికారులు ఎలిగేడులో పర్యటించి పోలీస్ స్టేషన్‌కు అనుకూలంగా ఉండే భవనాలను పరిశీలించారు. గతంలో బీసీ హాస్టల్ నిర్వహించిన భవనంతో పాటు రెవెన్యూ కార్యాలయాన్ని నిర్వహించిన భవనాలను పర్యవేక్షించారు. ఈ రెండు భవనాల్లో పాత రెవెన్యూ కార్యాలయం అనుకూలంగా ఉందని నిర్ధారించినట్లు తెలిసింది. ఆ భవన స్థితిగతులను తెలుసుకొని అవసరమైన మేరకు అనుకూలంగా ఉండే విధంగా ఏర్పాట్లు చేసేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీనివల్ల త్వరలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు కానుందని ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



గతంలో తహసీల్దార్ కార్యాలయం నిర్వహించిన భవనం




## ఆవిర్భావ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు




ఉత్సవాలకు ముస్తాబైన వేదిక

గోదావరిఖని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ వేడుకలకు గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం సుందరంగా ముస్తాబైంది. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు స్టేడియం గ్రౌండ్స్‌లో ప్రధాన వేదికతో పాటు అనేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లన్నింటిని ఆర్‌జీ-1 జీఎం లలితకుమార్ ఆదివారంసాయంత్రం పరిశీలించారు. సోమవారం ఉదయం 9గంటల నుంచి రాత్రి 10గంటల వరకు సింగరేణి ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాలను స్టేడియం గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు అతిథులుగా జీఎం లలిత్‌కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్ హాజరుకానున్నారు. ఉదయం సింగరేణి జెండావిష్కరణతో కార్యక్రమాలు ప్రారంభమై ముఖ్య అతిథుల సందేశాలు, స్టాల్స్ ప్రారంభోత్సవాలు జరుగనున్నాయి. సాయంత్రం జ్యోతి ప్రజ్వలనలు, కేక్‌కటింగ్‌లు, ఉత్తమ కార్మికులకు సన్మానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతి ప్రదానోత్సవాలు జరుగనున్నాయి.

### కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు బీ అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం పోతనకాలనీ సివిక్ జోన్‌లో కాంట్రాక్టు కార్మికులతో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థులు కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని, న్యాయమైన వేతనాలు అందిస్తామని ఇచ్చిన హామీలు అమలుకాలేదన్నారు. జీఓ 22ను గెజిట్ చేసి సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేయాలని, హైపవర్ వేతనాలు అమలు చేయాలన్నారు. రాజేశం, మల్లేశం, ఎల్లక్క, పద్మ, నగేష్, రమేష్, ఓదేలున్నారు.

## ఏఐటీయూసీపై విమర్శలు మానుకోవాలి

గోదావరిఖని, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిస్తే తోటి కార్మిక సంఘాలు ఓర్వడం లేదని, ఇది ట్రేడ్ యూనియన్ విధానానికి మంచి పద్ధతి కాదని, ఏఐటీయూసీపై అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఏఐటీయూసీ ఆర్‌జీ-1 బ్రాంచి జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిలో గత పది సంవత్సరాలుగా గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ ఉంటె కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, స్ట్రక్చర్ సమావేశాలు జరుగడం లేదని ఏఐటీయూసీ పలుమార్లు సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు పెట్టాలని గత ప్రభుత్వాన్ని కోరినా ఎన్నికలు నిర్వహించలేదన్నారు. ఎన్నికలు పెట్టాలని ఏఐటీయూసీ హైకోర్టుకు వెళ్లడంతో సింగరేణిలో డిసెంబరు 27న జరిగిన ఎన్నికల్లో ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలిస్తే తోటి కార్మిక సంఘాలు ఓర్వడం లేదన్నారు. పైగా పసలేని విమర్శలు చేస్తూ కార్మికుల మనసుల్లో ఏఐటీయూసీపై విషబీజాలు నాటుతూ వారిని అయోమయానికి గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా ఏఐటీయూసీ ఎదుర్కొంటుందన్నారు. అసలు సింగరేణిలో ఎన్నికలు అవసరం లేదని యాజమాన్యంతో ములాఖతై కార్మికులకు ద్రోహం చేసిన సంఘాలు ఏఐటీయూసీపై ఆరోపణలు, విమర్శలు చేసే నైతిక అర్హత లేదని పేర్కొన్నారు. ఏఐటీయూసీ ఎన్నికల్లో గెలిచిన తరువాత పది నెలలకు గుర్తింపు పత్రం తీసుకున్న వెంటనే నవంబరులో కార్మికుల ముఖ్యమైన సమస్యలను స్ట్రక్చర్ సమావేశంలో మాట్లాడడం జరిగిందన్నారు. కొన్నింటిపై అవగాహన కుదిరిందని, మిగతా వాటిని సీఎండీ స్థాయి సమావేశంలో మాట్లాడుతామన్నారు. కార్మికుల మొత్తం సమస్యలు ఒకేసారి కావని, ఒక పద్ధతి ప్రకారంగా యాజమాన్యంతో మాట్లాడి పరిష్కారం చేస్తామని తెలిపారు. సింగరేణికి రావలసిన రూ.33వేల కోట్ల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణిలో పాతబడిన మిషన్‌లతో బొగ్గు ఉత్పత్తి చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, కొత్త మిషన్‌ల కోసం బడ్జెట్ అవసరం ఉందన్నారు. యూనియన్ మెంబర్ షిప్‌కు కార్మిక వర్గం సహకరించి ఏఐటీయూసీని బలోపేతం చేయాలని ఆయన కోరారు. ఏఐటీయూసీ ఆర్‌జీ-1 బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, నాయకులు గౌతం గోవర్ధన్, రంగు శ్రీను, ఎస్ వెంకట్ రెడ్డి, బోగ సతీష్ బాబు, గండి ప్రసాద్, పెర్క మహేందర్, మిట్ట శంకర్, కే శ్రీనివాసరావు, ఎండీ సోహేల్, చెప్యాల భాస్కర్ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కొరిమి రాజ్‌కుమార్

## ఆర్జీ-2 ఉత్తమ ఉద్యోగుల ఎంపిక



ప్రదీప్‌కుమార్



తాళ్సూరి శ్రీధర్



బి రఘు



సత్యనారాయణ

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఆర్జీ-2 యాజమాన్యం ఉత్తమ ఉద్యోగులను ఆదివారం ఎంపిక చేసింది. ఉత్తమ పనితీరు ఆధారంగా కార్మికుల నుండి ఇద్దరు, అధికారుల నుంచి ఇద్దరి చొప్పున ఎంపిక చేశారు. ప్రదీప్‌కుమార్(డిప్యూటీ సూపరెండెంట్ ఇంజనీర్, సీహెచ్‌పీ), తాళ్సూరి శ్రీధర్(అడిషనల్ మేనేజర్, ఓసీపీ-3), బీ రఘు(ఎలక్ట్రిషియన్, ఓసీపీ-3), తాండ్ర సత్యనారాయణ(ఈపీ ఆపరేటర్, ఓసీపీ-3). ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని నేడు జరగనున్న ఆవిర్భావ ఉత్సవంలో జీఎం సన్మానించనున్నారు.

● ఆర్జీ-3 ఏరియాలో..

**రామగిరి(ఆంధ్రజ్యోతి):** సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్లలో ఉత్తమ కార్మికులను ఎంపిక చేస్తూ ఆదివారం ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో ఆర్జీ-3 డివిజన్‌లోని ఓసీపీ-1 అడిషనల్ మేనేజర్ కోటయ్య, సివిల్ విభాగం డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ రామకృష్ణ, ఓసీపీ-2 ఈపీ ఆపరేటర్ లక్ష్మీనారాయణ, ఓసీపీ-1 జనరల్ మజ్దూర్ రాజయ్య, అండ్రియాల ప్రాజెక్ట్ ఏరియా డిప్యూటి మేనేజర్ అశోక్, డిప్యూటి సూపరింటెండింగ్ ఇంజనీర్ యాదగిరి, సీనియర్ మైనింగ్ సర్దార్ సంపత్‌రావు, మల్టీ జాబ్‌వర్కర్ మరియాదాస్ ఎంపికయ్యారు. వీరిని సింగరేణి దినోత్సవం వేడుకల్లో సత్కరించనున్నట్లు జీఎంలు తెలిపారు.



కాకా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆర్జీ-2 జీఎం

## ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో 'కాకా' వర్ధంతి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి జీ వెంకటస్వామి వర్ధంతిని ఆదివారం ఆర్జీ-2 యాజమాన్యం నిర్వహించింది. జీఎం ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జీఎం బండి వెంకటయ్య వెంకటస్వామి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈప్రాంతానికి చెందిన వెంకటస్వామి సాధారణ స్థాయి నుంచి పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగిన నేతగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు సాధించినట్టు తెలిపారు. కేంద్ర మంత్రిగా పేదలు, బడుగు వర్గాల ప్రజల అభ్యున్నతికి కాకా కృషి చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ నరసింహారావు, ఓసీపీ-3 పీఈ రాజాజీ, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, డీవైపీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

### ఐఎన్‌టీయూసీ భవన్‌లో..

రామగిరి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐఎన్‌టీయూసీ భవనంలో ఆదివారం పెద్దపల్లి మాజీ పార్లమెంట్ సభ్యుడు గడ్డం వెంకటస్వామి(కాకా) వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జరుపుకున్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెంకటస్వామి చిత్రపటానికి పట్టణ శాఖ అధ్యక్షుడు కాటం సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బర్ల శ్రీనివాస్, తోట చంద్రయ్య, కొమురయ్యగౌడ్, ఉడుత శంకర్, మల్లారెడ్డి, బంకు మల్లేష్, సంతు, తాటి సతీష్, తాటి శ్రీనివాస్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో వెంకటస్వామి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకొని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.